క్లుప్తంగా

సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణ ప్రజలు ప్రతీమూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలోని ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. సెప్టిక్ ట్యాంక్‌ల క్లీనింగ్ కోసం డి స్లెడ్జింగ్ ఆపరేటర్లను సంప్రదించాలని సూచించారు. రీ సైక్లింగ్ అయిన తర్వాత వచ్చిన నీటిని మొక్కలకు వాడుకోవచ్చని తెలిపారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, ప్లాంట్ ఆపరేటర్ రాకేశ్‌లు ఉన్నారు.

జక్కాపూర్ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో రాణించిన విద్యార్థులతో ఉపాధ్యాయినులు

సిద్దిపేటరూరల్: మాసపత్రిక గడుగ్గాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి 2025 కథలు, కవితలు, వ్యాసాల పోటీలలో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయులు షౌకత్ అలీ శుక్రవారం తెలిపారు. కెనడా దేశ కేంద్రంగా ప్రపంచంలోని తెలుగు విద్యార్థులందరికీ ఈ పోటీలు గత నెలలో నిర్వహించారు. అందులో కే విశిష్ట, పీ మధుహాసిని, కే హర్షవర్ధన్, కే అభిషేక్‌లు, కే సౌమ్య ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇందిరమ్మ సర్వేకు సహకరించాలి

గజ్వేల్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రజలు సహకరించాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలమున్న వారికి రూ. 5లక్షల ఆర్థిక లబ్ధి పొందేందుకు అర్హులైన వారు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి మరింతగా సహకరించండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటుగా జిల్లాలోని అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ మరింతగా సహకరించాలని పీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో చంద్రం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బ్యాంకు ఉద్యోగి అదృశ్యం

సిద్దిపేటకమాన్: బ్యాంకు ఉద్యోగి అదృశ్యమైన ఘటన సిద్దిపేట టూటౌన్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన మనోజ్‌కుమార్ స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో క్లర్క్. శంకర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. అతనికి భార్య స్రవంతి, ఇద్దరు పిల్లలున్నారు. గతంలో రెండు సార్లు మనోజ్ ఇంట్లో వాళ్లకు చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి గొచ్చాడు. ఈ క్రమంలో గురువారం దంపతుల మధ్య గొడవ జరగగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వేర్వేరు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు ఇంటికి బయలు దేరారు. భర్త మనోజ్ రాత్రి అయినా ఇంటికి రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెక్కు అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వేచరేణికి చెందిన కావ్యకు మంజూరైన రూ.18 వేల చెక్కు సీఎం సహాయనిధి చెక్కును కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్ అందజేశారు. సీఎం సహాయ నిధి పేదల పాలిట వరంవంటిదన్నారు.

● దుబ్బాకటౌన్‌లో...



రాయపోల్ అంబేడ్కర్ చౌరస్తాలో...

● సిద్దిపేట ఎడ్యుకేషన్



డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ..

● సిద్దిపేటకమాన్



సిద్దిపేట జిల్లా కోర్టులో..

● నంగునూరు(సిద్దిపేట)లో...



నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

సావిత్రిబాయి పూలే ఆదర్శనీయురాలు

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్త్రీలు అన్ని రంగాల్లో సమానత్వాన్ని పొందుతున్నారంటే అది పూలే కృషి అని వక్తలు అన్నారు. సావిత్రి ఆదర్శనీయురాలు అని కొనియాడారు.

● సిద్దిపేట ప్రశాంత్‌నగర్ లో.. మహిళా లోకానికి స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయిపూలే అని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పూలే జయంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు.

● హుస్నాబాద్‌లో



ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

● ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)లో



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

● గజ్వేల్‌రూరల్‌లో



సింగాటంలోని ప్రభుత్వ పాఠశాలలో ..

● జగదేవ్‌పూర్(గజ్వేల్)లో



తిగుల్‌లో..

● కొండపాకలో



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

సిద్దిపేటఅర్బన్: విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలోని విద్యారణ్య ఆవాస విద్యాలయంలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ విద్యాపీఠం జిల్లా కార్యదర్శి సాంబ శివరావు మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారడం వల్ల ఉపాధ్యాయ వృత్తి యొక్క గొప్పతనం, ఉపాధ్యాయుల బాధ్యత ఎంత విలువైందో తెలుస్తుందన్నారు. సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ ఉన్నత స్థానంలో స్థిరపడతారన్నారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తడ్కమడ్ల ఈశ్వరయ్య, పాఠశాల అధ్యక్షుడు కొమురవెల్లి శేఖరం, కరీంనగర్ విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవీందర్, పాఠశాల కార్యదర్శి మంతపురి నారాయణ, ప్రధానాచార్యులు మద్దుల నవీన్, అకడమిక్ ఇన్‌చార్జి మడుపు విజయలక్ష్మి, సిద్దిపేట సరస్వతీ శిశు మందిర్ కార్యదర్శి పెద్ది వైకుంఠం, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో టీచర్స్

పాము కాటుకు మందుల కొరత

● ఇబ్బందుల్లో ప్రజలు
● పట్టించుకోని అధికారులు
● రామవరం పీహెచ్‌సీ పరిధిలో పరిస్థితి ఇదీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మారుమూల పల్లెలు, గిరిజనతండాలు, గ్రామాల చుట్టూ గుట్టలు, అడవి దీంతో తరుచూ పాములు సంచరిస్తుంటాయి. అక్కన్నపేట మండలం రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది కానీ పాముకాటుకు మందులు అందుబాటులో లేవు. దాని పరిధిలో నాలుగు ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో 95 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తారు. ప్రజలంతా పొద్దున లేచింది మొదలు ఎక్కువ సమయం పొలాల్లోనే సంచరిస్తుంటారు. ఎవరైనా పాముకాటుకు గురైతే ప్రాణాలు పోయే పరిస్థితి ఇక్కడుంది. గ్రామీణ, గిరిజన ప్రాంతంలోని ఆస్పత్రిలో మందులు అందుబాటులోకి తీసుకురావాలన్న ధ్యాసే వైద్యాధికారులకు లేకపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుక్క కాటుకు కూడా సరైన మందులు లేవని వైద్యసిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు.



రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గిరిజన తండాలు అధికం

రామవరం పీహెచ్‌సీ పరిధిలో మారుమూల గ్రామాలు, గిరిజన తండాలే అధికంగా ఉన్నాయి. దూల్మిట్ట మండలంలో ఐదారు గ్రామాల ప్రజలు ఇక్కడికే వస్తుంటారు. వైద్యపరీక్షల నిమిత్తం రోజూ సుమారుగా 60 నుంచి 100 వరకు ఓపీలు నమోదవుతాయని వైద్యసిబ్బంది చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పీహెచ్‌సీలో పాముకాటుకు మందు అందుబాటులో లేదు. అలాగే కుక్క కాటుకు కూడా ప్రాథమిక చికిత్స చేస్తున్నాం. మందులు అందుబాటులో లేవన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మారుమూల గ్రామాలు, పల్లెలు, తండాలు అధికంగా ఉన్నాయి.

– వినోద్‌రెడ్డి, వైద్యాధికారి, రామవరం పీహెచ్‌సీ

‘సంక్రాంతి సంబరాలు విజయవంతం చేద్దాం’

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంక్రాంతి సంబరాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈనెల 5న సిద్దిపేటలోని మల్టీపర్పస్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆదివారం ఉదయం ముగ్గులు, వంటల పోటీలు, భోగి మంటలు, దాండియా, సాయంత్రం యువకులు, పిల్లలకు, పెద్దలకు కై ట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో పాటుగా ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సంబరాలకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వెంకట్, కార్యక్రమం నిర్వాహకులు కటకం మానస, బొమ్మగోని పద్మ, గరిపల్లి తులసి, జోగిపర్తి హారిక, బుక్క స్వప్న, మద్ది అనిత, కొమురవెల్లి కళ్యాణి, పిన్న శిరీష, రాధిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి

● రుణమాఫీ కోసం వినతి



ఏఈఓ సింధూజకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రుణం రూ.2 లక్షల లోపు ఉన్నా గానీ మాఫీ కాలేదని శుక్రవారం రైతులు ఆందోళన నిర్వహించారు. అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామ రైతువేదిక వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకున్నారని, దీంతో కొంతమంది మాఫీ పొందలేక పోయారని వాపోయారు. ప్రతీరైతుకు రూ.2లక్షల మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు ఏఈఓ సింధూజకు వినతిపత్రం అందజేశారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

● సమయ పాలన ఏది?





కొమురవెల్లి రెవెన్యూ కార్యాలయంలోని ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయం తెరుచుకోకపోవడం అందుకు నిదర్శనం. కాగా పని నిమిత్తం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులు, సిబ్బంది కోసం పడిగాపులు పడ్డారు. ఈ విషయమై తహసీల్దార్‌కు స్థానికులు ఫోన్ చేశారు. ఆయన కలెక్టర్ కార్యాలయంలో ఉన్నట్లు తెలిపారన్నారు. ఉన్నత అధికారులు స్పందించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–కొమురవెల్లి(సిద్దిపేట)

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి రాజనర్సింహకు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్క సతీశ్

సిద్దిపేటకమాన్: మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట ప్రధాన కార్యదర్శి మార్క సతీశ్‌కుమార్ హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సుధీర్‌కుమార్, రోహిత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: టీఎన్జీఓ సంఘం నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి శుక్రవారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, సహాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కోశాధికారి అహ్మద్ పాల్గొన్నారు.

కురుమలకు దేవస్థానం చైర్మన్ పదవీ ఇవ్వాల్సిందే

చేర్యాల(సిద్దిపేట): కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ పదవీ కురుమలకు కేటాయించాలని ఆసంఘం రాష్ట్ర నాయకుడు ఒగ్గు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కురుమల ఆరాధ్య దైవం మల్లికార్జునస్వామి అని, ఈ దేవస్థానం చైర్మన్, డైరెక్టర్ పదవులు వారికే ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు జనాభా ప్రాతిపదికన తక్కువ జనాభా ఉన్న ఒక సామాజికవర్గానికే కట్టబెడుతూ ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం రెండు పర్యాయాలు కురుమలకు చైర్మన్ పదవి ఇచ్చి న్యాయం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రస్తుత సర్కారు స్పందించి కురుమలకు చైర్మన్, డైరెక్టర్‌లుగా నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కురుమలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నారాయణరావు

మద్దూరు(హుస్నాబాద్): ప్రజలకు వైద్య సిబ్బంది ఎప్పుడు అందుబాటు ఉంటూ మెరుగైన సేవలు అందించాలని, సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంకేంద్రంలోని ఆరోగ్య కేంద్రంతో పాటు లద్నూరు ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రెండు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగిందని, చలి తీవ్రతను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హాస్పిటల్‌కు వచ్చే ప్రజలను మంచి వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు ఎప్పుకప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుధీర్‌రాజ్, రజిత తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నారాయణరావు

సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సిద్దిపేట జిల్లా శాఖ ఎన్నికలు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శిగా బైండ్ల లింగం, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ పొన్నాల బాలయ్య, గౌరవ సలహాదారుడిగా బండారి వేణు, సహాధ్యక్షుడిగా గంగుల మల్లేశం, మహిళా ఉపాధ్యక్షులు మంజుల, ఉపాధ్యక్షులుగా కిష్టయ్య, సతీష్, రేణుక, కోశాధికారిగా నసీరుద్దీన్‌లతో పాటుగా ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ రవూఫ్, బైండ్ల లింగంలు మాట్లాడుతూ, భాషా పండితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న బాషా పండితులను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఈ సమస్యల పట్ల సానుకూలంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుల్లపల్లి తిరుమల కాంతికృష్ణ, రాష్ట్ర సహాధ్యక్షులు నాగుల భిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రకాంత్ హాజరయ్యారు. కార్యక్రమంలో శంకర్, రాజమౌళి, ఎం సంధ్యారాణి, నరేందర్, కనక లింగం, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, శివరాజమణి, పర్వేజ్, కిష్టయ్య, అశోక్, ఇందిరా, సమియోద్దీన్ పాల్గొన్నారు.



అబ్దుల్ రవూఫ్, జిల్లా అధ్యక్షుడు



బైండ్ల లింగం, ప్రధాన కార్యదర్శి

తాగునీరు వృథా చేయొద్దు

● మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్


సిద్దిపేటజోన్: కరీంనగర్ జిల్లా లోయర్ మానేరు డ్యామ్ నుంచి పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి తేస్తున్న తాగునీరును ప్రజలు వృథా చేయొద్దని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన పలు వార్డుల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ వాటర్ లెవల్ ట్యాంక్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని వార్డుల్లో నీటి సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వార్డు ప్రజలను నీటి సరఫరా ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ నల్లాలకు మోటార్లు బిగించరాదని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా సాగాలని, తడి, పొడి, హానికర చెత్తను సేకరించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా తప్పదని హెచ్చరించారు. రైతు బజార్‌లో తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ చేయాలని సూచించారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో పట్టణ వీధి వ్యాపారుల విక్రయదారుల కమిటీ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ పాల్గొన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో విక్రయాలు చేయాలని సూచించారు. ఎన్జీఓ కాలనీ, హౌసింగ్ బోర్డ్ వద్ద ఉన్న రైతు బజార్‌లో ఆసక్తి ఉన్న రైతులు, వ్యాపారులు విక్రయాలు చేయాలని సూచించారు. మున్సిపల్ డీఈ ప్రేరణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, మెప్మా తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

వాహనదారులు నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వేల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఎంవీఐ కార్యాలయంలో పలువురు వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.



రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ క్రిస్టోఫర్